సాక్షి
జనగామ
ఆదివారం । 9 । ఫిబ్రవరి । 2025

ముక్తీశ్వరుడికి అభిషేక పూజలు

కాళేశ్వరంలో నేడు మహా కుంభాభిషేకం..

హాజరు కానున్న రాష్ట్ర మంత్రులు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వర ముక్తీశ్వర దేవాలయంలో మహాకుంభాభిషేకంలో భాగంగా శనివారం శతచండి యాగం, మహారుద్ర సహిత సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. ఈ వేడుకలకు తుని తపోవనం పీఠాధిపతి శ్రీసచ్చిదానందసరస్వతిస్వామి హాజరుకాగా.. నేడు జరిగే మహాకుంభాభిషేకానికి ముగ్గురు మంత్రులు రానున్నారు. - కాళేశ్వరం



8లో

న్యూస్‌రీల్

నాణ్యమైన భోజనం అందించాలి

- ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్



జనగామ రూరల్: వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి సరుకుల నిల్వ గది, వంట గది, సిబ్బంది, విద్యార్థుల హాజరు రిజిస్టర్, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన పోషకాహారం, శుద్ధమైన తాగునీటిని అందించాలన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలన్నారు. అదనపు కలెక్టర్ వెంట డీఎస్సీడీఓ విక్రమ్, ఎస్‌డబ్ల్యూఓ అనిల్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా కావ్యశ్రీ



బచ్చన్నపేట: తెలంగాణ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని చిన్నరామన్‌చర్ల గ్రామానికి చెందిన పిన్నింటి కావ్యశ్రీరెడ్డిని నియమిస్తూ శనివారం మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా కావ్యశ్రీ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్

జనగామ రూరల్: కేంద్ర క్రీడా మంత్రిత్వ, యువజన శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించి జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ శనివారంతో ముగిసింది. ఈ మేరకు ధర్మకంచ మినీ స్టేడియంలో గెలుపొందిన జట్లకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ నవీన్ యాదవ్, క్రీస్తుజ్యోతి కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ వై.అజిత్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్.ఎస్ చంద్రశేఖర రెడ్డి, పి.డి. ఆనంద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు స్నేహపూర్వకంగా మెలగాలి

- ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్



బచ్చన్నపేట: పోలీస్‌స్టేషన్‌కు పలు సమస్యలతో వచ్చే వారితో పోలీసులు స్నేహపూర్వకంగా మెలగాలని ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి స్టేషన్ చుట్టూ పరిసరాలను పరిశీలించి లాకప్ గదులను పలు స్టేషనరీలను చూశారు. అలాగే పోలీసులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో క్రైమ్ రేటు పెరగకుండా చూడాలని, యువత డ్రగ్స్ బారిన పడి వారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎస్‌కే హమీద్, కానిస్టేబుళ్లు నర్సిరెడ్డి, అనిల్, శ్రీనివాస్, భానుచందర్, రాకేష్, తిరుపతిరెడ్డి, విద్యలక్ష్మి, అఖిల, యాదగిరి, వినయ్, తిరుపతి, పలువురు పాల్గొన్నారు.


బీజేపీ జెండా ఎగరడం ఖాయం



జనగామ రూరల్: రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమని జిల్లా నూతన అధ్యక్షుడు సౌడ రమేశ్ అన్నారు. శనివారం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించినందుకు జనగామ చౌరస్తాలో శనివారం బాణాసంచా పేల్చుతూ సంబురాలు నిర్వహించారు. కార్యకర్తల కృషితో రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోనూ బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సిరికొండ విద్యాసాగర్ రెడ్డి, ఉడుగుల రమేశ్, శివరాజ్, పజ్జూరి లక్ష్మీనరసయ్య, శ్రీనివాస్, ఎల్లయ్య, అశోక్ జగదీశ్, మురళి, మహేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

మాతృ దేవోభవ.. పితృదేవోభవ.. ఆచార్య దేవోభవ.. ఇలా మన పెద్దలు తల్లిదండ్రుల తర్వాతి స్థానం గురువులకు ఇచ్చారు. విద్యార్థులకు తరగతి గదిలో విద్యాబుద్ధులు నేర్పి వారిని ఉన్నత స్థానంలో నిలపాల్సిన కొందరు ఉపాధ్యాయులు దారి తప్పుతున్నారు. పాఠశాలలకు వచ్చే బిడ్డల్లాంటి విద్యార్థినులను లైంగికంగా వేధిస్తున్నారు. ఆ విషయాన్ని బాధిత విద్యార్థులు అటు తల్లిదండ్రులకు, ఇటు సన్నిహితులకు చెప్పుకోలేక లోలోపల కుమిలిపోతున్నారు. లైంగిక వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో చివరికి ధైర్యం తెచ్చుకుని తల్లిదండ్రులకు చెబుతున్నారు. పాఠశాల స్థాయి విద్యార్థినులకు 'ఏది గుడ్ టచ్.. ఏది బ్యాడ్ టచ్' అనేది తల్లిదండ్రులు ఇంటి వద్దనే నేర్పించాలని, బ్యాడ్ టచ్ అయితే భయపడకుండా చెప్పాల్సిన అవసరం ఉందని మానసిక వికాస నిపుణులు చెబుతున్నారు.

- తొర్రూరు/కాజీపేట



చెబుదాం.. మంచీచెడు!

ఏది గుడ్ టచ్.. ఏది బ్యాడ్ టచ్

విద్యార్థినులపై ఉపాధ్యాయుల లైంగిక వేధింపులు, అనుచిత ప్రవర్తన

కొందరు ఉపాధ్యాయుల తీరుతో విద్యాశాఖకు మచ్చ

పాఠశాలల్లో చోటుచేసుకుంటున్న ఘటనలతో తల్లిదండ్రుల ఆందోళన

సండే స్పెషల్



చెడు స్పర్శ
ఛాతిపై చేయి వేయడం, నడుం కింద, వెనుకవైపు తాకడం, అనుచితంగా ప్రవర్తించడం, అసభ్యకర రీతిలో వ్యవహరించడం.

మంచి స్పర్శ
తల, వీపుపై తట్టడం, కరచాలనం, ప్రశంసిస్తూ బుగ్గలు, చెవులను తాకడం

విద్యార్థినులకు చెబుదాం.. మంచీచెడు

- ఎవరైనా అసభ్యంగా తాకినా వద్దని చెప్పే ధైర్యం నూరిపోయాలి. కుటుంబ సభ్యులతోనూ నడుచుకోవాల్సిన విధానం వివరించాలి.
- బడుల్లో మహిళా ఉపాధ్యాయులు, మార్గదర్శకులు అర్థమయ్యేలా వివరించాలి. రోజువారీ విషయాలు తమతో ఆడపిల్లలు పంచుకునే వాతావరణం తల్లిదండ్రులు కల్పించాలి. ఆత్మరక్షణ విద్య నేర్పించాలి.
- పోలీసులతోపాటు విద్య, వైద్య, ఆరోగ్య, ఐసీడీఎస్ విభాగాల అధికారులు తరచూ పాఠశాలలను సందర్శించాలి. పక్కాగా కమిటీలు వేయాలి.
- విద్య, శిక్షణ సంస్థల్లో పనిచేసే సిబ్బంది పూర్వాపరాలు తెలుసుకోవాలి.
- పాఠశాలల వద్ద ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం చేరవేయాలి.
- విద్యాసంస్థల్లో సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి.



ఉమ్మడి జిల్లాలో జరిగిన ఘటనలు

- జనవరిలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం దొబ్బలపాడు మోడల్ స్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థినులను సీఎం కప్ పోటీల నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్లిన పీఈటీ వారిపట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. విచారణ చేసి అతడిని సస్పెండ్ చేశారు.
- ఇటీవల తొర్రూరు మండలం అరిపిరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఘటన వెలుగు చూసింది. ఉపాధ్యాయుల వేధింపుల వ్యవహారం బయటకు పొక్కడంతో పాఠశాలకు చేరుకుని తల్లిదండ్రులు, స్థానికులు ఆందోళన చేపట్టి వారికి దేహశుద్ధి చేశారు.
- మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం సక్రాంనాయక్ తండాలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు చిన్నారులకు నీలి చిత్రాలు చూపించాడు. తమతో ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని విద్యార్థినులు తల్లిదండ్రులకు చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు టీచర్‌కు దేహశుద్ధి చేశారు. సదరు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు.
- రెండేళ్ల క్రితం దంతాలపల్లి మండలం దాట్ల గ్రామ ఉన్నత పాఠశాలలోని ఓ ఉపాధ్యాయుడు క్రీడల పేరిట తాకరాని చోట తాకుతూ విద్యార్థినులను వేధించాడు. విషయం బయటకు పొక్కడంతో టీచర్‌పై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

తల్లిదండ్రుల్లో ఆందోళన..



అనైతిక, క్షమార్హం కాని చర్యలకు పాల్పడుతున్న పలువురు ఉపాధ్యాయుల తీరుతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదివించే ఆర్థిక స్థోమత లేక పేదింటి తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తున్నారు. పలు ప్రాంతాల్లో చిన్నారులపై వేధింపుల ఘటనలు వెలుగు చూస్తుండటంతో కన్నవారు కుమిలిపోతున్నారు. చదువు మాన్పించేందుకు సైతం తల్లిదండ్రులు వెనుకాడడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు సన్నగిల్లే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఉపాధ్యాయులపై నిఘా ఉంచాలని, తప్పు చేసినట్లు తేలితే కఠినంగా వ్యవహరించాలని కోరుతున్నారు.

ఉపాధ్యాయుల వికృత చేష్టలను విద్యాశాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. దీంతో కొందరు గురువులు తమ మానసిక ఆనందం కోసం బిడ్డల్లాంటి చిన్నారులపై మృగాలుగా ప్రవర్తిస్తూ వృత్తికే కళంకం తీసుకువస్తున్నారు.

అన్ని జిల్లాల్లో ఇలా చేస్తే బెటర్..

వరంగల్ జిల్లా పరిధిలోని అన్ని గురుకులాలు, కేజీబీవీలు, ప్రభుత్వ పాఠశాలల్లో కలెక్టర్ డాక్టర్ సత్య శారద వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విద్యార్థినులు నేరుగా చెప్పుకోలేని సమస్యలను తెలుసుకునేందుకు ఫిర్యాదు పెట్టెలను ప్రతి పాఠశాలలో ఏర్పాటు చేశారు. నేరుగా చెప్పలేని సమస్యలను విద్యార్థులు పేపర్‌పై రాసి ఆ ఫిర్యాదు పెట్టెలో వేస్తున్నారు. ఈ పెట్టెల నిర్వహణను స్వయంగా కలెక్టరే చూస్తున్నారు. ఇటీవల నెక్కొండలోని గురుకులం, కేజీబీవీలో ఆ ఫిర్యాదు పెట్టెలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి ఇద్దరు ప్రిన్సిపాళ్లు, వార్డెన్, పీఈటీకి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇలాంటి ఫిర్యాదు పెట్టెలను అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేస్తే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేట మోడల్ స్కూల్‌లో ఏర్పాటుచేసిన ఫిర్యాదుల పెట్టె (ఫైల్)

ఫిర్యాదుకు భయపడొద్దు..



చిన్నతనం నుంచి బాలికల్లో ధైర్యాన్ని నూరిపోయాలి. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, ఇంకా ఏమైనా జరిగినా వెంటనే తల్లిదండ్రులకు చెప్పాలి. ఇంట్లో చెబితే తనను నిందిస్తారని బాలికలు భయపడొద్దు. లేదంటే ఆ సమస్య పెద్దగా మారే ప్రమాదం ఉంది. పిల్లలు చెప్పే విషయాన్ని తల్లిదండ్రులు సావధానంగా వినాలి. అంతే కానీ, వారి మనసుకు కష్టం కలిగేలా మాట్లాడకూడదు. ఫిర్యాదు చేస్తే సమాజంలో ఏమనుకుంటారో అని తల్లిదండ్రులు కూడా భయపడొద్దు. ఆపద సమయంలో బాలికలు వెంటనే 100 నంబర్‌కు డయల్ చేయడం ఉత్తమం.

- వై.సుధాకర్‌రెడ్డి, సీఐ, కాజీపేట

చిన్నప్పటినుంచే అవగాహన కల్పించాలి




తల్లిదండ్రులు ఆడపిల్లలకు మంచి చెడులు వివరించి చెప్పాలి. బ్యాడ్‌టచ్, గుడ్ టచ్ అంటే ఏమిటి? వాటి పర్యవసానాలను ఎలా ఎదుర్కోవాలనే విషయంపై అవగాహన కల్పించాలి. పిల్లలను ఇష్టారీతిగా తాకితే వెంటనే రియాక్ట్ అయ్యేలా చూడాలి. పిల్లలు ఇటువంటి అనుభవం ఎదురైనప్పుడు నిర్భయంగా తల్లికి చెప్పుకునేలా మనోధైర్యం కల్పించాలి. బయట ఎటువంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేలా తయారు చేయాలి.

- అశోక్ పరికిపండ్ల, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు, సైకాలజిస్ట్

'పది' పరీక్షల్లో నూతన విధానం

- జీపీఏ గ్రేడింగ్ తొలగింపు.. మార్కులకు శ్రీకారం
- క్యూ ఆర్ కోడ్‌తో 24 పేజీల ఆన్సర్ షీట్...



జనగామ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణలో మార్పులను తీసుకు వచ్చింది. జీపీఏ గ్రేడింగ్ విధానాన్ని తొలగిస్తూ.. పాత పద్ధతి మార్కుల నిబంధనను తిరిగి తీసుకు వచ్చింది. గతంలో 91 శాతం పర్సంటేజ్ సాధించిన విద్యార్థులకు 10 జీపీఏ ఇచ్చే వారు. దీంతో ఈ ఘనత సాధించిన ప్రతి విద్యార్థిని ప్రథమ ర్యాంకు కింద ఉత్తీర్ణత సాధించినట్టుగానే గుర్తించేవారు. వచ్చే నెల మార్చి 21 నుంచి జరగనున్న పది వార్షిక పరీక్షల్లో ఈ నిబంధనలను మార్చి.. మార్కుల విధానాన్ని తీసుకు రాబోతున్నారు. దీంతో పాటు క్యూ ఆర్ కోడ్ విధానంతో 24 పేజీల ఆన్సర్ షీట్‌ను కొత్తగా తీసుకు రానున్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్రంలోని కామారెడ్డితో పాటు మరో జిల్లాకు ఆన్సర్‌షీట్లను పంపించిన ప్రభుత్వం, అన్ని జిల్లాలకు పంపించేందుకు సిద్ధమవుతోంది.

పరీక్షల్లో పారదర్శకత

పది వార్షిక పరీక్షలను మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. పొరపాట్లకు తావు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటోంది. ఎక్కడా కూడా ఎలాంటి ఆరోపణలకు తావులేకుండా పరీక్షలను నిర్వహించేందుకు అనేక మార్పులను తీసుకువచ్చింది. 24 పేజీల ఆన్సర్ పేపర్లను ఓఎంఆర్ షీట్‌తో పిన్ చేసి విద్యార్థికి ఇస్తారు. 24 పేజీల మినహా, అదనంగా ఇవ్వరు. ప్రశ్నలకు జవాబులను అందులోనే రాయాల్సి ఉంటుంది. ఈ విధానంతో పేపర్ల మార్పిడి, తదితర లోపాలకు తావు ఉండదు. 20 ఇంటర్నల్, మిగతా 80 మార్కులను విద్యార్థి రాసే పరీక్ష ద్వారా ఇవ్వనున్నారు. మార్కుల విధానం తీసుకు రానుండడంతో జీపీఏ మాదిరిగా కాకుండా, ఒక్క మార్కు ఎక్కువ వచ్చిన విద్యార్థినే.. ప్రథమ స్థానంలో నిలిచే అవకాశం ఉంటుంది. దీంతో ప్రతి బడిలో టాప్ ర్యాంకర్ ఒక్కరే నిలువనున్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు, గురుకులాల్లో 6,237 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయనున్నారు. వచ్చే నెల మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు వార్షిక పరీక్షలను నిర్వహించేందుకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తుంది.

పీఏసీఎస్ నిధుల గోల్‌మాల్!

- కంచనపల్లి సొసైటీలో రూ.60లక్షల నిధుల రికవరీకి ఆదేశాలు
- బచ్చన్నపేట సొసైటీ జడ్జిమెంట్ పెండింగ్?
- కళ్లెం భూమికి సంబంధించి నోటీసులు

జనగామ: ప్రాథమిక సహకార సొసైటీల్లో అక్రమాలకు అంతులేకుండా పోయింది. అధికారుల పర్యవేక్షణ లోపం అక్కడి అధికారులకు కలిసొచ్చింది. ఏళ్ల తరబడి నిధుల రాబడి.. ఖర్చు లెక్కలను గాలికి వదిలేయడంతో అందినకాడికి దోచేశారు. నిర్లక్ష్యంగా డబుల్ పేమెంట్లు, రైతుల పేరిట రుణాలు తీసుకుని అటు పీఏసీఎస్ ఇటు ప్రభుత్వ సొమ్మును మేసేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పంట రుణమాఫీ సమయంలో ప్రభుత్వం నుంచి వచ్చిన మెసేజ్‌తో వందలాది మంది రైతులు అయోమయానికి గురయ్యారు. పీఏసీఎస్‌లో తీసుకోని రుణాలకు ఎలా మాఫీ చేశారంటూ కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదులు చేశారు. ఈ విషయమై పలువురు అధికారులపై వేటు వేసి తదుపరి విచారణ గాలికి వదిలేయగా.. నిధుల పక్కదారిపై రికవరీకి ఆదేశాలు జారీ చేయగా, కొన్ని చోట్ల జడ్జిమెంట్ పెండింగ్‌లో ఉంది.

క్రిమినల్ చర్యలకు కూడా..

రఘునాథపల్లి మండలం కంచనపల్లి ప్రాథమిక సహకార సొసైటీ (పీఏసీఎస్)లో 2021 నుంచి 2023 వరకు జరిగిన నిధుల గోల్‌మాల్‌పై ఈపీ (ఎగ్జిక్యూటివ్ పిటిషన్) ఫైల్ చేశారు. నిధులు పక్కదారి పట్టినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో విచారణ కమిటీ వేశారు. విచారణలో రూ.60 లక్షల వరకు నిధులు పక్కదారి పట్టినట్లు నిర్ధారించారు. నిధులను ఖర్చు చేసే సమయంలో ఎలాంటి నిబంధనలు పాటించలేదని తుది రిపోర్టులో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి పీఏసీఎస్ కార్యదర్శి (సీఈఓ) వి.శ్రీనివాస్‌ను గతంలోనే సస్పెండ్ చేయగా.. క్రిమినల్ చర్యలకు కూడా సిద్ధమవుతున్నట్లు సమాచారం. పక్కదారి పట్టిన సొసైటీ నిధులను కార్యదర్శి ద్వారా రాబట్టేందుకు రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు సహకరించని సమయంలో పోలీసు ప్రొటక్షన్ తీసుకోవాలని సూచించారు.



కంచనపల్లి పీఏసీఎస్ సొసైటీ

కళ్లెం భూమికి సంబంధించి నోటీసులు

లింగాలఘణపురం మండలం కళ్లెం సొసైటీకి సంబంధించిన సుమారు 8 గుంటల భూమిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సీఈఓ (కార్యదర్శి), ప్రెసిడెంట్‌తో పాటు కొన్న వ్యక్తులకు నోటీసులు జారీ చేశారు. భూమి విషయంలో విచారణ చేస్తున్నారు. మూడు పీఏసీఎస్‌ల్లోనే ఇంతటి అక్రమాలు వెలుగు చూస్తుంటే.. మిగతా చోట్ల పరిస్థితి ఏంటనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని అన్ని ప్రాథమిక సహకార సొసైటీలో పూర్తి స్థాయిలో ఆడిటింగ్ నిర్వహించి నిధుల ఖర్చుకు సంబంధించిన నిజనిజాలు నిగ్గు తేల్చాలని ప్రజలు కోరుతున్నారు.

బచ్చన్నపేట సొసైటీలో డబుల్ పేమెంట్?

బచ్చన్నపేట పీఏసీఎస్ సొసైటీలో ప్రస్తుత పాలక మండలి కాకుండా అంతకు ముందు జరిగిన నిధుల గోల్‌మాల్‌పై జిల్లా సహకార సొసైటీ అధికారి వద్ద జడ్జిమెంట్ పెండింగ్‌లో ఉంది. రూ.8 లక్షల వరకు డబుల్ పేమెంటు, రెండు ధాన్యం లారీల డబ్బులు (సుమారు 7 లక్షలు), మొత్తంగా రూ.20 లక్షల వరకు పక్కదారి పట్టినట్లు విచారణలో గుర్తించగా.. అధికారిక నిర్ధారణ జరగాల్సి ఉంది. ఈ విషయంలో అప్పటి సీఈఓ (కార్యదర్శి), సెంటర్ ఇన్‌చార్జ్, తదితరులను సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారు. రెండు లారీల ధాన్యం డబ్బులు పక్కదారి పట్టించారనే ఆరోపణల నేపథ్యంలో.. ఇవి ఎక్కడ నుంచి వచ్చాయనే అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. డీసీఓ తీర్పు తర్వాత రికవరీ చేస్తారా లేక ఎలా ముందుకు వెళతారనే క్లారిటీ రానుంది.

రికవరీకి ఆదేశాలు



కంచనపల్లి పీఏసీఎస్‌లో పక్కదారి పట్టిన రూ.60 లక్షల నిధులను రాబట్టేందుకు రికవరీకి ఆదేశాలు జారీ చేశాం. ఇందుకు సంబంధించి ఈపీ ఫైల్ చేశాం. కార్యదర్శి (సీఈఓ) వి.శ్రీనివాస్‌ను గతంలోనే సస్పెండ్ చేయగా, ఆయన నుంచి పూర్తి స్థాయిలో డబ్బులను రికవరీ చేస్తాం. బచ్చన్నపేట సొసైటీలో రూ. 20 లక్షల నిధుల పక్కదారి, కళ్లెం సొసైటీ పరిధిలోని 8 గుంటల భూమి మాయంపై నోటీసులు జారీ చేసి సంజాయిషీ కోరాం.

- రాజేందర్‌రెడ్డి, జిల్లా సహకార సొసైటీ అధికారి

రాష్ట్రంలో తుగ్లక్ పాలన కొనసాగుతోంది..

- ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి తుగ్లక్ పాలన సాగిస్తుంటే నియోజకవర్గంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి నియంతలా రాక్షసపాలన చేస్తున్నాడని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానిక బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యతో కలిసి శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 14 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని, 420 హామీలతో ప్రజలను దగా చేశారని ఆరోపించారు. కేసీఆర్‌ను తిట్టడం, హరీశ్‌రావు, కేటీఆర్‌లపై కేసులు పెట్టడం తప్ప రేవంత్‌రెడ్డి చేసిందేమిలేదన్నారు.

కూతురి రాజకీయం కోసం పార్టీ మారిన కడియం

కూతురి రాజకీయం కోసం కడియం శ్రీహరి పార్టీ మారిండని పోచంపల్లి ఘాటుగా విమర్శించారు. నియోజకవర్గంలో అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో బీఆర్‌ఎస్ శ్రేణులను బెదిరింపులకు గురిచేస్తున్నారని, బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు మనోజ్‌రెడ్డిపై కక్షపూరితంగా కేసులు పెట్టి జైల్లో పెట్టించాడని ఆరోపించారు. కేసులు, నిర్బంధాలకు బెదిరేది లేదని, ప్రజలు అంతా గమనిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంస్థ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి, నాయకులు మాచర్ల గణేశ్, కనకం గణేశ్, తాటికొండ సురేష్, చల్లా చందర్‌రెడ్డి, ఆకుల కుమార్, గుర్రం శంకర్, గుండె మల్లేష్, చిట్టిబాబు, ఆగారెడ్డి, భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి

39 మంది గైర్హాజరు

జనగామ రూరల్: ప్రాక్టికల్ పరీక్షలకు 39 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని డీఐఓ జితేందర్ రెడ్డి తెలిపారు. శనివారం మొదటి సెషన్‌లో జనరల్, ఒకేషనల్ 336 మంది విద్యార్థులకు గాను 310, రెండవ సెషన్‌లో జనరల్, ఒకేషనల్ 289 మందికి గాను 276 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. మొత్తం 39 మంది గైర్హాజరు అయినట్లు ఆయన తెలిపారు. జిల్లా పరీక్ష నియంత్రణ అధికారులు ఎస్. శ్రీనివాస్, వి.శేఖర్ జనగామ, నర్మెటలోని పరీక్ష కేంద్రాలను సందర్శించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట: తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ, ఎస్సీ కార్మికుల పిల్లల్లో నిరుద్యోగ యువతకు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ పి.అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. హౌస్ వైరింగ్, ల్యాండ్ సర్వే కోర్సుల్లో మూడు నెలల శిక్షణ ఉంటుందని, టెన్త్, ఇంటర్, డిప్లొమా, ఇంజనీరింగ్ చదివిన వారు శిక్షణ పొందడానికి అర్హులను పేర్కొన్నారు. శిక్షణకు ఎంపికైన వారికి ఉచిత భోజన సదుపాయంతో పాటు ఉత్తీర్ణత సాధించాక సర్టిఫికెట్లు పంపిణీ చేస్తామన్నారు. ఇతర వివరాలకు 9963611239, 9949684763 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- డీఈఓ రమేశ్



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో డీఈఓ, ఉపాధ్యాయులు

పాలకుర్తి: టెన్త్ విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని, తమ ప్రతిభను మెరుగు పర్చుకున్న విద్యార్థులు మట్టిలో మాణిక్యాలుగా ఎదిగితే సాధించలేనిది ఏదిలేదని జిల్లా విద్యాశాఖాధికారి రమేశ్ అన్నారు. శనివారం పాలకుర్తి విద్యావనరుల కేంద్రంలో జిల్లాలోని 425 మంది విద్యార్థులు ప్రజ్ఞోత్సవ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. అనంతరం ఎంఈఓ పోతుగంటి నర్సయ్య అధ్యక్షత జరిగిన సమావేశంలో డీఈఓ పాల్గొని మాట్లాడారు. అనంతరం ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ అధికారి శ్రీనివాస్, సిబ్బంది రమేశ్, శైలజ, శోభారాణి, సంధ్యారాణి, ఇమ్మడి అశోక్, సూర్యప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అరుణాచల గిరి ప్రదక్షిణకు ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు



హన్మకొండ: తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్ నడపుతున్నట్లు వరంగల్–1 డిపో మేనేజర్ వంగల మోహన్ రావు తెలిపారు. ఈ నెల 12న పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం ఈ నెల 10న మధ్యాహ్నం 3 గంటలకు హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నుంచి ప్రత్యేక బస్ బయలుదేరుతుందని ఆయన ఒక ప్రకటనలో వివరించారు. హనుమకొండ నుంచి బయలుదేరి ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకం చేరుకుంటుందని, ఇక్కడ విఘ్నేశ్వరుడి దర్శనం అనంతరం బయలుదేరి వెల్లూరులోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. భక్తులు ఇక్కడ గిరి ప్రదక్షిణ ముగించుకున్న తర్వాత తిరిగి హనుమకొండకు చేరుకుంటారన్నారు. చార్జీలు పెద్దలకు రూ.4500, పిల్లలకు రూ.3 వేలు నిర్ణయించినట్లు వివరించారు. వివరాలకు 9959226047, 9494107944, 7382855793 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మద్యం తాగొద్దు..

- తండ్రి మందలించాడని కుమారుడి ఆత్మహత్య
- బొల్లికొండలో ఘటన



వినోద్ (ఫైల్)

నెక్కొండ: మద్యం తాగొద్దని తండ్రి మందలించడానే కారణంతో కుమారుడు ఎస్సారెస్పీ కాల్వలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం మండలంలోని బొల్లికొండలో జరిగింది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బానోత్ వినోద్ (26) అదే గ్రామానికి చెందిన ఓ డీజే యజమాని వద్ద పని చేస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం రాత్రి మద్యం తాగి ఇంటికి రావడంతో ఆందోళనకు గురై తండ్రి మాను శనివారం ఉదయం మందలించాడు. దీంతో మనస్తాపానికి చెందిన వినోద్ గ్రామ సమీపంలోని ఎస్సారెస్పీ కాల్వలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంవత్సరం క్రితం అనారోగ్యంతో భార్య.. ప్రస్తుతం కుమారుడు మృతి చెందడంతో మాను గుండెలవిసేలా రోదించాడు. ఈ ఇద్దరి మృతితో మాను దిక్కులేని వాడయ్యారని గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వినోద్ మృతదేహానికి పంచనామా చేసిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించామని ఎస్సై పేర్కొన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కలశాభిషేకం చేస్తున్న ప్రధాన పూజారి దంపతులు త్రిపురారి కృష్ణమూర్తి శర్మ రాణి, కలశాలను అభిషేకం చేయడానికి తీసుకెళ్తున్న ప్రధాన పూజారి





ముక్తీశ్వరుడికి అభిషేకపూజలు

- నేడు మహాకుంభాభిషేకం.. 10.42 గంటలకు ముహూర్తం
- పాల్గొననున్న ముగ్గురు రాష్ట్ర మంత్రులు

కాళేశ్వరం: రుత్వికులు, వేదపండితుల మంత్రోచ్చరణలతో కాళేశ్వర క్షేత్రం మార్మోగింది. మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో శనివారం రెండో రోజు మహాకుంభాభిషేకం పూజల్లో భాగంగా శతచండి, మహారుద్ర సహిత సహస్ర ఘటాభిషేం పూజలను పండితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు ప్రాతఃకాల సూక్త మంత్రపఠనం చేశారు. దేవస్థానం ప్రధాన అర్చకుడు త్రిపురారి కృష్ణమూర్తిశర్మ దంపతుల ఆధ్వర్యంలో అచ్చలాపురం అవధాని దుద్దిళ్ల మనోహరశర్మ శిశ్యులతో పూజాతంతు నిర్వహించారు. రెండురోజులు నుంచి పూజలు నిర్వహించిన కలశాలలోని జలాలతో గర్భగుడిలో శతచండి, మహారుద్రాభిషేకం, సహస్ర ఘటాభిషేకం పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం 3.30గంటలకు యాగశాలలో చండీహోమం, ప్రదోషకాల పూజలు, హారతి, మంత్ర పుష్పం, చతుర్వేదసేవలు, తీర్థప్రసాద వితరణలు చేశారు. 1,331 ఆవర్తానాలను పండితులు పూర్తి చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, ఉచిత ప్రసాదం అందజేశారు.

నేడు ముగ్గురు రాష్ట్ర మంత్రుల రాక..

42 ఏళ్ల తరువాత మహాకుంభాభిషేకం కార్యక్రమం నిర్వహిస్తుండడంతో ఈసీ అనుమతితో రాష్ట్ర మంత్రులు ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ ప్రత్యేక హెలికాప్టర్‌లో రానున్నారు. కాగా, ఎమ్మెల్సీ ఎలక్షన్‌కోడ్ అమలులో ఉన్న నేపథ్యలో ఈసీ అనుమతితో మంత్రులు కాళేశ్వరం వస్తున్నారు. మంత్రుల పర్యటన నేపథ్యలో లక్ష్మీ పంపుహౌస్ సమీపంలోని అప్రోచ్ కెనాల్ వద్ద హెలిపాడ్‌ను ఆర్అండ్‌బీ అధికారులు శుభ్రం చేశారు. ఆదివారం ఉదయం 9.30గంటలకు రానున్నారు.

రెండోరోజు మంత్రోచ్చరణలతో మార్మోగిన కాళేశ్వరం



గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

నేడు 10.42 గంటలకు ముహూర్తం

మహాకుంభాభిషేకం సంప్రోక్షణ కార్యక్రమం ఆదివారం(నేడు) ఉదయం 10.42గంటలకు తుని తపోవనం పీఠాధిపతి సచ్చిదానందసరస్వతిస్వామి చేతుల మీదుగా నిర్వహించనున్నారు. ప్రధాన ఆలయంతో పాటు ఆలయ గోపురాలు, ఇతర అనుబంధదేవాలయాలకు సంప్రోక్షణ చేయనున్నారు. ఈకార్యక్రమం వీక్షణకు నాలుగు ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేస్తున్నారు. రాజగోపురం, దక్షిణ గోపురం వద్ద రెండేసి చొప్పున అమర్చనున్నారు. రాఝుగోపురం వద్ద ఆలయ ప్రవేశానికి క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

కాశీకి దీటైన క్షేత్రం కాళేశ్వరం..

- తుని తపోవనం పీఠాధిపతి సచ్చిదానందసరస్వతిస్వామి



గణపతి పూజలు చేస్తున్న సచ్చిదానంద సరస్వతి స్వామి

కాళేశ్వరం: కాశీకి దీటైన క్షేత్రం కాళేశ్వరమని, కాశీలో మరణిస్తే ముక్తి..కాళేశ్వరాన్ని దర్శించుకుంటేనే ముక్తి, పుణ్యఫలం లభిస్తుందని తుని తపోవనం పీఠాధిపతి సచ్చిదానందసరస్వతి స్వామి ప్రవచనంలో తెలిపారు. శనివారం ఆయన కాళేశ్వరానికి రాగా ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతించారు. అక్కడి నుంచి ముందు గణపతిపూజ చేసి, కాళేశ్వరముక్తీశ్వరస్వామి గర్భగుడిలో అభిషేక పూజలు చేశారు. అనంతరం శ్రీశుభానందాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. కల్యాణ మండపం వద్ద ఆలయ అధికారులు ఏర్పాటు చేసిన వేదిక వద్ద భక్తులకు ప్రవచనాలు తెలిపారు. కాళేశ్వర క్షేత్రం గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహిణి సరస్వతీనది కలిసిన మహాక్షేత్రం అన్నారు. పురాతన దేవాలయాల్లో ఒక్కటైన క్షేత్రంలో కాళేశ్వరుడు(యముడు)ని ముందు దర్శించుకొని, ఈశ్వరుడు(శివుడు)ని తర్వాత దర్శించుకుంటే పుణ్యఫలం చెందుతుందని పేర్కొన్నారు. మేనెలలో సరస్వతి అంతార్వాహిణి నదికి పుష్కరాలు జరుగుతాయన్నారు. మహాకుంభాభిషేకంలో చండి, సహస్ర ఘటాభిషేకం, మహారుద్రాభిషేకం నిర్వహించడం విశేషమన్నారు. అచ్చలాపురం మనోహరశర్మనును అభినందించారు. ఆర్జేసీ రామకృష్ణ రావు, డీసీ సంధ్యారాణి, ఈఓ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హన్మకొండ : విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ టీజీ ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు ఆరెపల్లి శ్రీనివాస్, కార్యదర్శి బక్క దానయ్య కోరారు. ఈ మేరకు శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగుల సమస్యలు వివరించగా, సీఎండీ సానుకూలంగా స్పందించిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కంపెనీ అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ కంపెనీ ఉపాధ్యక్షుడు రౌతు రమేశ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎ.లక్ష్మీనారాయణ, కోశాధికారి స్వదేశ్ కుమార్, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

బాలాజీ ఆస్పత్రి వైద్యులకు నోటీసులు

తొర్రూరు: వైద్యం వికటించి బాలుడు మృతి చెందిన ఘటనపై పట్టణంలోని బాలాజీ ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులకు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ శనివారం నోటీసులు జారీ చేసింది. కౌన్సిల్ రిజిస్టర్ లాలయ్య ఘటనపై వారం రోజుల్లో కౌన్సిల్‌కు వచ్చి వాంగ్మూలం అందించాలని ఆదేశించారు. తొర్రూరు మండలంలోని కంఠాయపాలెం గ్రామానికి చెందిన సిద్దార్థ(15) జ్వరంతో పట్టణంలోని బాలాజీ ఆస్పత్రికి రాగా ఇంజక్షన్ ఇచ్చారు. కొద్ది సమయం తరువాత చనిపోయాడు. దీంతో వైద్యం వికటించడంతోనే బాలుడు మృతి చెందాడని కుటుంబీకులు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే.ఈ ఘటనపై తెలంగాణ కౌన్సిల్ స్పందించి వాంగ్మూలం అందించాలని ఆదేశించింది. డాక్టర్లు వికాస్, పూర్ణిమ అందించిన వైద్యం వివరాలు వెల్లడించాలని పేర్కొంది.

13 కిలోల ఎండు గంజాయి పట్టివేత

- తల్లీకూతుళ్ల అరెస్ట్, రిమాండ్

రఘునాథపల్లి: ఎండు గంజాయి తరలిస్తున్న తల్లీకూతుళ్ల నుంచి పోలీసులు రూ 3. 43 లక్షల విలువైన 13 కేజీల 730 గ్రాముల సరుకు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శనివారం రఘునాథపల్లి పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై దూదిమెట్ల నరేశ్ వివరాలు వెల్లడించారు. ఒడిశాలోని తమెండో గ్రామానికి చెందిన నమిత బిషోయాను భర్త వదిలేశాడు. దీంతో కూతురు వివాహం చేసేందుకు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో అక్రమార్కులతో చేతులు కలిపింది. ఇందులో భాగంగా ఒడిశా నుంచి సూరత్‌కు గంజాయి తీసుకెళ్లి అక్కడ తన మనిషికి అప్పగిస్తే రూ. 10 వేలతో పాటు కూతురు పెళ్లికి సాయం చేస్తానని శంకర్ అనే వ్యక్తి ఆశ చూపాడు. అందుకు నమిత బిషోయా ఒప్పుకుంది. ఈ నెల 5న ఖుర్ద రైల్వే స్టేషన్‌లో శంకర్.. ఎండు గంజాయిని తల్లీకూతుళ్లకు అప్పగించి పూరి– తిరుపతి రైలు ఎక్కించాడు. తెనాలిలో ఆ రైలు దిగి సూరత్ వెళ్లే నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కారు. ఈ క్రమంలో వరంగల్ వద్ద పోలీసులు నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీ చేస్తుండగా గంజాయి బ్యాగులతో తప్పించుకున్నారు. శనివారం కాకతీయ ఎక్స్‌ప్రెస్‌లో సికింద్రాబాద్ వెళ్తున్న క్రమంలో పోలీసులు తనిఖీ చేయగా రఘునాథపల్లి రైల్వే స్టేషన్‌లో దిగారు. అనుమానాస్పద స్థితిలో ఉన్న తల్లీకూతుళ్లను పోలీసులు తనిఖీ చేయగా వారి వద్ద 13 కేజీల730 గ్రాముల గంజాయి లభించింది. దీంతో తల్లీకూతుళ్లను అరెస్ట్ చేసి వారి సెల్‌ఫోన్, గంజాయి స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని, శంకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



రఘునాథపల్లి: నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్సై నరేశ్

స్టేషన్‌ఘన్‌పూర్‌లో మరో మహిళ వద్ద 12 కిలోలు..

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వేస్టేషన్ వద్ద పోలీసులు ఓ మహిళ నుంచి 12 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం రైల్వేస్టేషన్ సమీపాన పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఒడిశాకు చెందిన మనంతి అనుమానాస్పదంగా కనిపించడంతో ఆమె వద్ద ఉన్న సంచులు తనిఖీ చేశారు. ఇందులో 12 కిలోల గంజాయి లభించడంతో స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ జి.వేణు తెలిపారు. కాగా, నిందితురాలు గంజాయి ఒడిశా నుంచి సూరత్‌కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

మేడారంలో పటిష్ట బందోబస్తు



సమ్మక్క గద్దె వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



గద్దెల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ రవీందర్

- ట్రాఫిక్ నియంత్రణకు కట్టుదిట్ట ఏర్పాట్లు
- భక్తులు, వీఐపీలకు ఎలాంటి ఆటంకం కలగకుండా పోలీస్ శాఖ చర్యలు

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం మినీజాతరకు ఇంకా మూడు రోజుల సమయమే ఉంది. దీంతో ముందస్తు మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు, వీఐపీలు ఆదివారం అధిక సంఖ్యలో తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో పోలీస్ శాఖ పటిష్ట చర్యలు చేపడుతోంది. ఎస్పీ శబరీశ్, డీఎస్పీ రవీందర్ పర్యవేక్షణలో కట్టుదిట్ట ఏర్పాట్లు చేస్తోంది.

ట్రాఫిక్ ఏర్పాట్ల పరిశీలన..

ఈనెల 12న బుధవారం మండమెలిగె పండుగ (మినీజాతర) ప్రారంభం కానున్న నేపథ్యంలో జాతర ముందు ఆదివారం రావడంతో తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు సుమారు లక్షకు పైగా తరలివచ్చే అవకాశం ఉందనే అంచనాతో పోలీస్ శాఖ ట్రాఫిక్ నియంత్రణ, ఇతర ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా పస్రా సీఐ రవీందర్ సిబ్బందితో కలిసి శనివారం బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించారు. పస్రా నుంచి నార్లాపూర్ మీదుగా మేడారానికి, తాడ్వాయి నుంచి మేడారానికి వచ్చే భక్తుల వాహనాల కోసం పార్కింగ్ స్థలాలను పరిశీలించారు.

బందోబస్తుకు 300 మంది పోలీసులు

నేడు (ఆదివారం) ఒకే రోజు మేడారంలో సుమారు 300 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నట్లు తెలిసింది. శనివారం సాయంత్రం నుంచే భక్తుల తాకిడి పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో పోలీసులకు డ్యూటీలు కేటాయించారు. జంపన్నవాగు నుంచి తాడ్వాయి వెళ్లే ఆర్టీసీ బస్టాండ్ వరకు భక్తుల వాహనాలు గద్దెల సమీపంలోకి వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు.

భక్తుల సందడి..

సమ్మక్క, సారలమ్మలను దర్శించుకునేందుకు భక్తులు శనివారం వేలాదిగా తరలివచ్చారు. జంపన్నవాగులోని స్నాన ఘట్టాలపై ఏర్పాటు చేసిన షవర్ల కింద స్నానాలు ఆచరించారు. అమ్మవార్ల గద్దెల వద్ద కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తులకు ప్రశాంత దర్శనం..

మేడారం మినీ జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఈఓ రాజేంద్రం తెలిపారు. ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకు జరిగే మినీ జాతర(మండమెలిగె పండుగ)కు సుమారు పది లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా ఉందన్నారు. ఈ నేపథ్యంలో అమ్మవార్ల దర్శనంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూస్తామన్నారు. జాతరలో భక్తులకు సేవలందించేందుకు దేవాదాయశాఖ తరఫున 85 మందిని ఏర్పాటు చేశామన్నారు.

భక్తులకు ప్రశాంత దర్శనాలు..

భక్తులు గ్రిల్ బయట నుంచే అమ్మవార్ల దర్శనాలు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆదివారం రద్దీ ఎక్కువ ఉండనున్న నేపథ్యంలో గద్దెల పైకి అనుమతిస్తే భక్తులు ఇబ్బందులకు గురికావడంతో పాటు చోరీలకు ఆస్కారముంటుందనే ఉద్దేశంతో గద్దెల పైకి వెళ్లకుండా గ్రిల్ బయట నుంచే దర్శనాలు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. కాగా, జాతరలో భక్తులు క్యూలైన్ల ద్వారా నేరుగా అమ్మవార్ల గద్దెల ప్రాంగణానికి చేరుకుని ప్రశాంత దర్శనాలు చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. సాధారణ భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా వీఐపీలను పోలీస్ కమాండ్ కంట్రోల్ రూం సమీపంలోని వీఐపీ మార్గం నుంచి ప్రత్యేక క్యూలైన్ ద్వారా రెండు గద్దెలను ఒకే దర్శించుకునేలా చర్యలు తీసుకోనున్నారు.

శుభకార్యానికి వెళ్లొస్తూ అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం
- మండలకేంద్రంలో ఘటన



వీరు (ఫైల్)

దంతాలపల్లి : శుభకార్యానికి వెళ్లొస్తూ ఓ వ్యక్తి అనంతలోకాలకు చేరాడు. ఆగివున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి బైక్‌తో ఢీకొని అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి మండలకేంద్రం శివారు బాలాజీ పత్తి మిల్లు సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఇనుగుర్తి మండలం కోమటిపల్లి శివారు చంద్రుతండా జీపీకి చెందిన బాదావత్ వీరు(48) తన భార్య శారదతో కలిసి బైక్‌పై దంతాలపల్లి మండలం తూర్పుతండాలోని తన బంధువుల ఇంటికి వచ్చాడు. అనంతరం తూర్పుతండా నుంచి శుభకార్యం నిమిత్తం కురవి మండలం తట్టుపల్లి గ్రామానికి వెళ్లారు. అక్కడ శుభకార్యం ముగిసిన వెంటనే తన భార్యను బంధువులు వచ్చిన ట్రాక్టర్‌లో ఎక్కించి తాను ఒంటరిగా బైక్‌పై తూర్పుతండాకు వస్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ మండల కేంద్రం శివారు బాలాజీ పత్తి మిల్లు సమీపంలో వరంగల్– ఖమ్మం జాతీయ రహదారిపై ఆగి ఉంది. వీరు బైక్‌పై వస్తున్న క్రమంలో వెనుక నుంచి ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు సతీశ్ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి ట్రాక్టర్ డ్రైవర్ శ్రీనుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ జన్నయ్య తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మరొకరు..



కోటయ్య మృతదేహం

లింగాలఘణపురం: మండలంలోని కిష్టగూడెం - చీటూరు గ్రామాల మధ్య శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లికి చెందిన బాచుపల్లి కోటయ్య (44) దుర్మరణం చెందాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. కోటయ్య కుందారం నుంచి స్వగ్రామం అప్పిరెడ్డిపల్లికి ఉదయం 5.30 గంటల ప్రాంతంలో నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో కిష్టగూడెం పెట్రోల్ బంక్ దాటిన అనంతరం గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

విచారించకుండానే నోటీస్!

- టీజీ ఎన్పీడీసీఎల్‌లో విచిత్రంగా క్రమశిక్షణ చర్యలు
- క్షేత్ర స్థాయిలో పరిశీలన, విచారణ చేయకుండానే ఉద్యోగికి షోకాజ్ జారీ..
- ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏఈఈ చెప్పాడని మరో ఏఈఈకి షోకాజ్



టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం

హన్మకొండ: నవ్విపోదురు కాకా నాకేంటి అన్నట్లు ఉంది టీజీ ఎన్పీడీసీఎల్ అధికారుల తీరు. తప్పులు చేసి క్రమశిక్షణ చర్యలు ఎదుర్కొన్న అధికారి చెప్పాడని.. మరో అధికారికి షోకాజ్ నోటీసు జారీ చేసిన తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారిపై ఆరోపణలు వచ్చిన క్రమంలో కనీసం ప్రాథమికంగానైనా విచారణ చేస్తారు.. అవసరమైతే క్షేత్ర స్థాయి పరిశీలన చేసిన తర్వాత ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేస్తారు. టీజీ ఎన్పీడీసీఎల్‌లో మాత్రం కొందరు ఉన్నతాధికారులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ విచిత్ర చర్యలకు పూనుకుంటున్నారని విమర్శలు ఎదుర్కొంటున్నారు.

ఒక పనికి ఒకటికి మించి ఎస్టిమేట్లు..

టీజీ ఎన్పీడీసీఎల్ ఖమ్మం సర్కిల్‌లో సివిల్ విభాగంలో పని చేస్తున్న ఓ క్షేత్రస్థాయి ఇంజనీర్ ఒక అభివృద్ధి పనికి ఒకే ఎస్టిమేట్ రూపొందించి పనులు పూర్తి చేయించాల్సి ఉండగా ఒక పనిని విభజించి ఒకటికి మించి ఎస్టిమేట్లు తయారు చేసి సంస్థకు నష్టం కలిగించే చర్యలకు పాల్పడ్డాడని ఎన్పీడీసీఎల్ ఉద్యోగ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దీనిపై విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు క్రమశిక్షణ చర్యల కింద పెద్దపల్లి సర్కిల్‌కు బదిలీ చేశారు. ఇక్కడ బాధ్యతలు చేపట్టిన అదే క్షేత్ర స్థాయి ఇంజనీర్ తిరిగి ఒక అభివృద్ధి పనిని విభజించి 15కు పైగా ఎస్టిమేట్లు రూపొందించారని, దీనిలో కొన్ని ఎస్టిమేట్లకు కంపెనీ కార్పొరేట్ కార్యాలయం నుంచి అనుమతులు తీసుకోలేదని గమనించిన అధికారులు నోటీసు జారీ చేశారని విద్యుత్ ఉద్యోగ వర్గాలు చర్చించుకుంటున్నారు. నోటీసు అందుకున్న ఈ అధికారి తాను బాధ్యతలు చేపట్టక ముందు ఇక్కడ పని చేసిన ఆ అధికారి ఎస్టిమేట్లు రూపొందించాడని, తనకు ఆ ఎస్టిమేట్లకు సంబంధ లేదని షోకాజ్ నోటీస్‌కు ఇచ్చిన సంజాయిషీలో పేర్కొన్నాడని, దీన్ని ఆధారం చేసుకుని ఎలాంటి పొరపాటు చేయని, గతంలోనూ ఎలాంటి ఆరోపణలు లేని ఆ అధికారికి షోకాజ్ నోటీసు జారీ చేశారని ప్రచారం జరుగుతోంది.

ఎలాంటి ఆరోపణలు లేని వ్యక్తికి నోటీస్ జారీ..

గతంలో క్రమ శిక్షణ చర్యలు తీసుకున్న వ్యక్తి, అక్రమాలకు పాల్పడుతారనే ఆరోపణలున్న వ్యక్తి చెప్పిన మేరకు గతంలో ఎలాంటి అక్రమాలకు పాల్పడలినట్లు ఎలాంటి ఆరోపణలు లేని, క్రమశిక్షణ చర్యలు ఎదుర్కోని వ్యక్తికి ఎలా సంజాయిషీ నోటీసు జారీ చేస్తారని ఎన్పీడీసీఎల్ సివిల్ విభాగం ఉన్నతాధికారులను ప్రశ్నిస్తున్నారు. అదే తప్పుడు పనులపై క్రమశిక్షణ చర్యల కింద బదిలీ పై వచ్చిన వ్యక్తి ఆరోపణలను ఎలా పరిగణనలోకి తీసుకుంటారని విద్యుత్ ఇంజనీర్ల అసోసియేషన్లకు చెందిన కొందరు నాయకులు ప్రశ్నిస్తున్నారు. కనీసం ప్రాథమిక విచారణ జరపకుండా, క్షేత్ర స్థాయి పరిశీలన చేయకుండా తప్పు చేయని వ్యక్తిపై ఎలా నిందారోపణలు చేస్తారని అసోసియేషన్ల నాయకులు నిలదీస్తున్నారు. ఇలాంటి చర్యలు ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తాయని తెలిపారు. ఇప్పటికైనా సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు తెలుసుకోవాలని వారు కోరారు. క్రమశిక్షణ చర్యలకు గురైన వ్యక్తి చెప్పిన మేరకు జారీ చేసిన షోకాజ్ నోటీసు విరమించుకోవాలని విద్యుత్ ఉద్యోగ వర్గాలు, పలు అసోసియేషన్‌ల నాయకులు కోరారు. ఈ విషయమై టీజీ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ అంకుష్ వివరణ కోసం సంప్రదించేందుకు యత్నించగా స్పందించలేదు.